క్లుప్తంగా

మండలంలో పటిష్ట పోలీసు బందోబస్తు



అల్లర్లు జరగకుండా పెద్దేవంలో పోలీసు గస్తీ

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలు చేశామని తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్ సుందర్ తెలిపారు. పెద్దేవం సెంటర్‌లో కొందరు టీడీపీ జెండాలతో హడావుడి చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి గొడవలు జరగకుండా చక్కబరిచారు. కాగా వేగేశ్వరపురంలో ఒక పికెట్ ఏర్పాటు చేశారు. మండలంలో రెండు స్ట్రైకింగ్ ఫోర్స్‌లు పర్యటించాయి. శాంతి భద్రతలకు విఘాతం కల్పించరాదని ఎస్సై తెలిపారు.

టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు

సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మండల ప్రజలు మంగళవారం టీవీలకు అతుక్కుపోయారు. ఉదయం నుంచీ ఫలితాలను ఉత్కంఠగా టీవీల్లో ఆసక్తిగా తిలకించారు. దాదాపు మండలంలోని అన్నిచోట్లా ఎన్నికల ఫలితాలపైనే చర్చ సాగింది. మండలం నుంచి వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలి వెళ్లారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ టీడీపీకే మెజారిటీ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 1,640 మంది బ్యాలెట్ ఓట్లు వేశారు. వాటిలో అత్యధికంగా టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు 1,023 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుకు 543 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరుణకుమారికి 34, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మూడు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి రెండు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థికి ఎనిమిది ఓట్లు పడ్డాయి. కొక్కిరిపాటి చినబాబు, కమల ఆరుగొలనులకు ఒక్కొక్క పోస్టల్ ఓటు పడింది. మరో అభ్యర్థి బొంత కిషోర్‌కు నాలుగు ఓట్లు పడ్డాయి. అయితే నోటాకు మాత్రం 21 ఓట్లు పడ్డాయి. అయితే స్వతంత్ర్య అభ్యర్థులైన ఊబా శ్రీకాంత్, తాతపూడి ప్రవీణ్‌లకు ఒక్క ఓటు పడకపోవడం విశేషం.

సొసైటీల్లో వరి విత్తనాల విక్రయాలు

తాళ్లపూడి: రైతుల ఖరీఫ్ వరి సాగుకు అవసరమైన వరి విత్తనాలు మండలంలోని అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జి.రుచిత తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట, రాగోలపల్లి, తాడిపూడి, మలకపల్లి సొసైటీల్లో రైతులు తమకు అవసరమైన వరి విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా తాళ్లపూడిలో కూడా ప్రత్యేకంగా మార్టేరు వారి ఆధ్వర్యంలో వరి విత్తనాలు విక్రయిస్తున్నారన్నారు. 30 కిలోల వరి విత్తనాల ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. పీఎల్ –1100 రకం రూ.1185, 1318 రకం రూ.990, 1061 రకం రూ.1180, స్వర్ణ-7029 రకం రూ.1200, సంపద గోల్డ్ –9558 రకం రూ.1700 రేటుకు విక్రయించనున్నట్టు ఏవో వివరించారు.

కొవ్వూరు అసెంబ్లీ విజేత ముప్పిడి



కొవ్వూరు ఎమ్మెల్యేగా గెలిచిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

- 33,466 ఓట్ల మెజారిటీతో గెలుపు
- వెంకటేశ్వరరావుకు దక్కిన ఓట్లు 91,720
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారికి దక్కినవి 58,284
- ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రం అందించిన ఆర్వో అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుపై ఆయన 33,466 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఓట్ల లెక్కింపు రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ యూనివర్సిటీలో మంగళవారం జరిగింది. ప్రతి రౌండ్‌లోనూ వెంకటేశ్వరరావు ఆధిక్యం కనబరిచారు. తొలి రౌండ్‌లోనే ఆయనకు 1,650 ఓట్ల మెజార్టీ లభించింది. కొవ్వూరు నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు ఉండగా, వారిలో 85.9 శాతం మంది అంటే 1,58,176 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇందులో వెంకటేశ్వరరావుకు 91,720 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి 58,284 ఓట్లు మాత్రమే దక్కాయి. దీంతో ఓట్ల లెక్కింపు 13వ, చివరి రౌండ్ ముగిసేసరికి వెంకటేశ్వరరావు 33,466 ఓట్ల మెజార్టీతో గెలిచినట్టు రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ప్రకటించారు. అనంతరం వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్టు ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

మూడుసార్లు పోటీ

ముప్పిడి వెంకటేశ్వరరావు, తలారి వెంకట్రావులు మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖాముఖీ తలపడ్డారు. గోపాలపురం నుంచి 2014లో తొలిసారి టీడీపీ తరఫున వెంకటేశ్వరరావు వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావుపై పోటీ చేసి 11,540 ఓట్ల మెజార్టీతో గెలిచారు. రెండోసారి కూడా 2019లో గోపాలపురం అసెంబ్లీ బరిలోనే వారిద్దరూ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో తలారి వెంకట్రావు 37,461 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇప్పుడు మూడోసారి కొవ్వూరు నుంచి ఇద్దరు నేతలు ప్రత్యర్థులుగా తలపడ్డారు. ఈ ఎన్నికల్లో వెంకట్రావుపై వెంకటేశ్వరరావు గెలిచారు.

ఇది ప్రజా విజయం

కొవ్వూరులో టీడీపీ విజయం ప్రజా విజయమని ఆ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్‌ల నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు విశ్వసించారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు నాయకత్వం పని చేస్తామన్నారు. తన గెలుపునకు పని చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు ముప్పిడి కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా తీర్పును గౌరవించి ప్రజాపాలన అందిస్తామన్నారు. రాజధాని, పోలవరం అంశాలతో పాటు సంక్షేమ,అభివృద్ధి పథకాలను అమలు చేస్తామన్నారు.

గోపాలపురం ఎమ్మెల్యేగా మద్దిపాటి



రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి నుంచి గోపాలపురం ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మద్దిపాటి వెంకట్రాజు

- 26,784 ఓట్ల మెజారిటీతో తానేటి వనితపై గెలుపు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి వనితకు వచ్చిన ఓట్లు 87,636
- వెంకట్రావుకు 1,14,420 ఓట్లు
- ధ్రువీకరణ పత్రం అందజేసిన ఆర్వో శివజ్యోతి

దేవరపల్లి: గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. రాజానగరంలో సమీపంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగింది. తెలుగుదేశం అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనితపై 26,784 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మద్దిపాటికి 1,14,420 ఓట్లు లభించగా, తానేటి వనితకు 87,636 ఓట్లు లభించాయి. 14 టేబుల్స్ ఏర్పాటు చేసి 18 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. లెక్కింపు మొదలయ్యాక ప్రతి రౌండ్ లోనూ మద్దిపాటి వెంకట్రాజు ఆధిక్యత సాధించారు. మొత్తం 2,11,659 ఓట్లు పోలయ్యాయి. వాటిలో 1,269 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. టీడీపీకి ఆధిక్యత మొదటి రౌండ్‌లో 1319, రెండో రౌండ్‌లో 3764, మూడో రౌండ్‌లో 4121, ఐదో రౌండ్‌లో 7133, ఆరో రౌండ్‌లో 8165, ఏడో రౌండ్‌లో 8630, ఎనిమిదో రౌండ్‌లో 10,607, తొమ్మిదో రౌండ్‌లో 13,270, పదో రౌండ్‌లో 13483, పదకొండో రౌండ్‌లో 14,684, 12వ రౌండ్‌లో 16885, 13వ రౌండ్‌లో 18,651, 14,15,16, 17 రౌండ్లలో టీడీపీకి ఆధిక్యత లభించింది. చివరిదైన 18వ రౌండ్‌తో ఆ పార్టీ మెజార్టీ 26,784 ఓట్లకు పెరిగింది. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే మద్దిపాటి వెంకట్రాజు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్టు గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేఎల్. శివజ్యోతి ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని నన్నయ యూనివర్సిటీలో అందజేశారు.



రాజానగరం నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఓట్ల లెక్కింపు

ఓటర్లది విలక్షణ తీర్పు

గోపాలపురం ఎస్సీ శాసనసభా నియోజకవర్గ ఓటర్లు గత 40 ఏళ్లుగా ఎన్నికల్లో విలక్షణ తీర్పు ఇస్తున్నారు. 1983 వరకూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ఇక్కడి ఓటర్లు అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తూ వచ్చారు. 1983 నుంచి 1999 వరకూ జరిగిన ఎన్నికల్లో ఓటర్లు టీడీపీ అభ్యర్థులను గెలిపించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంతో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మద్దాల సునీతను గెలిపించి టీడీపీకి షాక్ ఇచ్చారు. 1983 నుంచి 2004 వరకూ ఐదు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులే విజయం సాధించారు. తిరిగి 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తానేటి వనిత గెలిచారు. 2014లో టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు విజయం సాధించారు. 1019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తలారి వెంకట్రావు పోటీ చేయగా ఓటర్లు తలారికి పట్టం కట్టారు. కాగా 1962లో గోపాలపురం నియోజకవర్గం ఏర్పడింది.

జనసేన ఖాతాలోకి నిడదవోలు

- 34,799 ఓట్ల మెజారిటీతో కందుల దుర్గేష్ గెలుపు
- 69,990 ఓట్లతో ద్వితీయ స్థానంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- తృతీయస్థానం నోటాదే
- మిగతా 10 మంది అభ్యర్థుల డిపాజిట్ల గల్లంతు



నిడదవోలు ఆర్వో వెంకటరమణ నాయక్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కందుల దుర్గేష్

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు శాసనసభ్యుడిగా కూటమి తరఫున పోటీ చేసిన జనసేన అభ్యర్థి కందుల లక్ష్మీ దుర్గేష్ విజయం సాధించారు. దుర్గేష్‌కు 1,04,089 ఓట్లు లభించగా, ఆయన ప్రధాన ప్రత్యర్థి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి 69,990 ఓట్లు వచ్చాయి. దాంతో కందుల దుర్గేష్‌కు 34,799 ఓట్ల మెజారిటీ లభించినట్టయ్యింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా దుర్గేష్‌కు 1,090, శ్రీనివాస్ నాయుడికి 595 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు రాజమహేంద్రవరం సమీపంలోని నన్నయ విశ్వ విద్యాలయంలో మంగళవారం జరిగింది. మొత్తం 16 రౌండ్లలో లెక్కింపు జరిగింది. మొదటి రౌండ్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 5,363 ఓట్లు, జనసేన అభ్యర్థి దుర్గేష్‌కు 7,091 ఓట్లు పోలయ్యాయి. చివరిదైన 16వ రౌండ్‌లో వైఎస్సార్ సీపీకి 178 ఓట్లు, జనసేనకు 488 ఓట్లు లభించాయి. ఇలా ప్రతి రౌండ్‌లోనూ దుర్గేష్ స్పష్టమైన ఆధిక్యత సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన 12 మందిలో పది మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. డిపాజిట్ లభించాలంటే పోలైన ఓట్లలో ఆరు శాతం ఓట్లు రావాలి. తృతీయ స్థానంలో 2,144 ఓట్లతో నోటా నిలిచింది. నిడదవోలు రిటర్నింగ్ అధికారి ఆర్. వెంకటరమణ నాయక్ చేతుల మీదుగా ఎన్నికల్లో గెలిచిన కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. విజయం సాధించిన దుర్గేష్‌కు నిడదవోలు మండలం విజ్జేశ్వరం, సమిశ్రగూడెం గ్రామాలతో పాటు నిడదవోలు పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణపతి సెంటర్‌లలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు, మందుగుండు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

మిగతా అభ్యర్థులకు పోలైన ఓట్లు

పెద్దిరెడ్డి సుబ్బారావు (కాంగ్రెస్-ఐ)కు 1495 ఓట్లు, గుమ్మాపు చిత్రసేన (బీఎస్పీ)కు 1260 ఓట్లు, కస్తూరి సత్యప్రసాద్ (ఆల్ ఇండియా ఫార్వడ్ బ్లాక్)కు 1691 ఓట్లు, కొట్టియాడ దుర్గ (జాతీయ జనసేన)కు 454 ఓట్లు, కంచెర్ల దుర్గేష్ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ)కు 1668 ఓట్లు, పాలమల వీరభద్రం (జైభారత్ పార్టీ)కు 311 ఓట్లు, ముక్కామల అన్నవరప్రసాద్ (పిరమిడ్ పార్టీ)కు 278 ఓట్లు, అరిగెల సత్యవరప్రసాద్ (ఇండిపెండెంట్)కు 478 ఓట్లు, గిద్దా వెంకటేశ్వరనాయుడు (ఇండిపెండెంట్)కు 347 ఓట్లు, గిద్దా శ్రీనివాసనాయుడు (ఇండిపెండెంట్)కు 283 ఓట్లు వచ్చాయి.

తొమ్మిది మంది అభ్యర్థుల డిపాజిట్ల గల్లంతు

- నోటా కంటే తక్కువగా ఓట్లు
- కాంగ్రెస్ అభ్యర్థికి 1.19 శాతం ఓట్లు వస్తే నోటాకు 1.55 శాతం ఓట్లు

కొవ్వూరు: ఈ సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 11 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వారిలో టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు 92,743 ఓట్లు (58.29 శాతం) సాధించి 33,946 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు 58,797 ఓట్లు (36.95 శాతం) వచ్చినప్పటికీ పరాజయం పాలయ్యారు. మిగిలిన తొమ్మిది మంది అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. నోటాకు గరిష్టంగా 2,444 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరిగెల అరుణకుమారికి 1.19 శాతం అంటే 1,897 ఓట్లు లభించాయి. ఇక లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొంతా శ్యాం రవిప్రకాష్ 652 (0.41శాతం) ఓట్లు సాధించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముప్పిడి శేఖర్‌బాబుకు 194 ఓట్లు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) అభ్యర్థికి 1,255 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర్య అభ్యర్థులు ఊబా శ్రీకాంత్‌కు 369, ఆరుగొలను కమలకు 151, కొక్కిరపాటి చినబాబుకు 162, తాతపూడి ప్రవీణ్‌కు 166, బొంతా కిషోర్‌కు 254 ఓట్లు పోలయ్యాయి. జాతీయ పార్టీ హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 1.19 శాతం ఓట్లు మాత్రమే పోలైతే నోటాకి మాత్రం 1.55 శాతం ఓట్లు పోలవడం గమనార్హం. గత ఎన్నికల్లో 35.80 శాతం ఓట్లు మాత్రమే పొందిన టీడీపీ ఈసారి 58.29 శాతం ఓట్లు దక్కించుకుని విజేతగా నిలిచింది. వైఎస్సార్ సీపీ గత ఎన్నికల్లో 52.35 శాతం ఓట్లతో విజయం సాధిస్తే ఈసారి 36.95 శాతం ఓట్లతో రెండో స్థానంలో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంటే గత ఎన్నికల్లో టీడీపీకి వచ్చిన ఓటింగ్ శాతం కంటే వైఎస్సార్ సీపీకి ఈసారి కాస్తా మెరుగ్గానే ఓటింగ్ శాతం వచ్చింది.

7నుంచి మార్కొండపాడు అమ్మవార్ల జాతర

చాగల్లు: మార్కొండపాడు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వారి జాతరను ఈ నెల 7వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత నెలలో అమ్మవార్లను నడి వీధిలోని పూరి గుడిసెలోకి తీసుకు వెళ్లారు. అప్పటి నుంచి పూరిగుడిసె వద్దే పూజలు నిర్వహిస్తున్నారు. పన్నెండేళ్ల కోసారి నిర్వహించే అమ్మవార్ల జాతర రోజుల్లో గ్రామం అంతా సందడి నెలకొంటుంది. అమ్మవారి ఆశీస్సుల కోసం పరిసర గ్రామల నుంచి కూడా భక్తులు భారీగా వస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7న అమ్మవార్ల సేవ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించనున్నారు. 8న బలిచేట, 9న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలియచేశారు.



ముత్యాలమ్మ వారు



అమ్మవారి పూరి గుడిసె

సాయికృష్ణకు డాక్టరేట్ ప్రదానం



నల్లజర్ల: స్థానిక ఏకేఆర్జీ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు నల్లజర్ల సాయికృష్ణకు విశాఖ పట్టణానికి చెందిన గీతమ్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జీర్ణకోశ వ్యాధులైన హెమరాయిడ్స్‌పై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు గాను తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు నల్లజర్ల సాయికృష్ణ మంగళవారం తెలిపారు. గీతమ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంటా సుహాసిని పర్యవేక్షణలో తానీ పరిశోధన వ్యాసాన్ని పూర్తి చేసినట్టు వివరించారు. సాయికృష్ణను ఏకేఆర్జీ విద్యాసంస్థల కరస్పాండెంట్ చావా గోఖుల్, సెక్రటరీ వడ్లమూడి రామారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రఘువీరవర్మ, అధ్యాపకులు అభినందించారు.

మట్టి ట్రాక్టర్ల జోరు.. ప్రజల బేజారు

- రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్న జనం
- ఛిద్రమవుతున్న రహదారులు
- అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు



కంసాలిపాలెంలో ట్రాక్టర్‌పై తరలిస్తున్న మట్టి

నిడదవోలు రూరల్: అధికారులు సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రెవెన్యూ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో అక్రమార్కులు రైతుల నుంచి మట్టిని కొనుగోలు చేసి మట్టి దందా సాగిస్తున్నారు. దాళ్వా పంట ముగిసిన వెంటనే రైతులు వేసవి సీజన్‌లో తమ పొలాల్లో మెరక, పల్లాల పనులు చేపడుతున్నారు. గతంలో కూలీలు, ఎడ్లబండ్ల సాయంతో ఈ పనులు చేసేవారు. ప్రస్తుతం కూలీల కొరత వల్ల జేసీబీ, పొక్లెయిన్‌ల సాయంతో ఈ పనులు చేపడుతున్నారు. ఇలా రైతుల నుంచి సేకరించిన మట్టిని కొందరు ఇటుక బట్టీలకు కూడా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇరుకు రహదారులపై మితిమీరిన వేగంతో మట్టి ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ట్రాక్టర్ల వేగానికి జడిసి గ్రామీణులు రోడ్డుపైకే రావాలంటేనే హడలిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భీతిల్లుతున్నారు. అతివేగం వల్ల కనురెప్ప పాటులో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. దీంతో మృతుల కుటుంబాలు శోక సంద్రంలో మునిగి పోతున్నాయి. లాభాలే ధ్యేయంగా కొంతమంది ఇష్టారాజ్యంగా చేస్తున్న మట్టి తరలింపు సామాన్యులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం, రావిమెట్ల, శెట్టిపేట గ్రామాల్లో ప్రస్తుతం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ అధికారుల ఉదాసీనత వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అనుభవం లేకుండానే..

మట్టి తరలింపునకు ప్రభుత్వ శాఖల అనుమతులు ఉండవు. ఆ వాహనాలు నడిపే డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం ప్రకారం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు కూడా ఉండవు. కొంతమంది పెద్దల పలుకుబడితో అడిగేవారు లేరని రెచ్చిపోతున్నారు. ట్రిప్పుల లెక్కన మట్టిని తరలించి, జేబులు నింపుకుంటున్నారు. ఎక్కువ ట్రిప్పులు వేసుకుంటే, ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు నడుపుతున్నారు. దీనికి తోడు మట్టిని తరలించే వాహనాలకు పెద్దపెద్ద శబ్దాలతో సినిమా పాటలు పెట్టుకుంటారు. ఇది చాలదన్నట్టు కొందరు డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తారు. మరికొందరైతే ఇయర్ ఫోన్ల ద్వారా సెల్‌ఫోన్లలోని పాటలు వింటూ వాహనాలు నడుపుతున్నారు. కంసాలిపాలెం గ్రామంలో రాత్రి వేళల్లో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు.

అనుమతులు లేకపోతే కఠిన చర్యలు



మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు తమ భూమిని మెరక, పల్లాలు చదును చేసుకోవడానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– వి.నాగభూషణం, తహసీల్దార్, నిడదవోలు

మట్టి తవ్వకానికి పాటించాల్సిన నిబంధనలు

- మట్టిని తవ్వుతున్న ప్రాంతం నుంచి తరలించే వరకూ ఎక్కడా ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు ఉండకూడదు.
- వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వి తరలించాలంటే రెవెన్యూ శాఖ అనుమతి తప్పనిసరి.
- ఎత్తుగా ఉన్న మెరక భూముల నుంచి మట్టిని తరలించాలంటే గనుల శాఖకు దరఖాస్తు చేసుకుని సంబంధిత అధికారుల నుంచి అనుమతి పొందాలి.
- మోటార్ వాహన చట్టం ప్రకారం మట్టి తరలించే వాహనానికి అన్ని అనుమతులూ ఉండాలి. డ్రైవర్‌కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి.
- వాహనంలో తరలించే మట్టిగడ్డలు బయటకు కనిపించకుండా దానిపై బరకాలు కప్పి తరలించాలి. మట్టి రవాణా వల్ల రహదారులు దెబ్బతింటే సంబంధిత అధికారులు వాటిపై చర్యలు తీసుకోవచ్చు.
- భూమి మార్పిడి కోసం రైతులు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ అనుమతులు తీసుకోవాలి.

డంపింగ్‌యార్డులా హండ్రెడ్ ఫీట్ రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి నుంచి ఎండోమెంట్ వాంబే కాలనీ మీదుగా నిర్మించిన హండ్రెడ్ ఫీట్ రోడ్డు డంపింగ్ యార్డులా మారిపోయింది. ఆ రోడ్డులో వాహన చోదకులతో పాటు ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్లు నడుస్తారు. అయితే ఈ రోడ్డు పక్కనే పేరుకుపోతున్న చెత్తా చెదారాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో పలు చోట్ల నుంచి బిల్డింగ్ వ్యర్థాలతో పాటు చెత్తను తీసుకువచ్చి ఈ రోడ్డు పక్కనే డంపింగ్ చేస్తున్నారు. వాటి కారణంగా ఆ ప్రాంతం చిన్న డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఈ విషయాన్ని నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ధర్మారెడ్డి కోరుతున్నారు.